క్లుప్తంగా

న్యాయవాదుల రిలే దీక్షలు



రిలే నిరాహార దీక్షలు చేపట్టిన న్యాయవాదులు

కదిరి టౌన్: లాయర్ రామస్వామినాయుడుపై దాడి చేసిన బీజేపీ నాయకుడు తలుపుల గంగాధర్, అతని అనుచరులను అరెస్ట్ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక కోర్టు సమీపంలో మంగళవారం రిలే దీక్షలు చేపట్టారు. న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదిపై జరిగిన దాడికి సంబంధించి గతనెల 28న ఫిర్యాదు చేశామని, ఇంత వరకు నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు. గంగాధర్‌పై 11 కేసులు ఉన్నాయని తెలిపారు. కాగా రిలే నిరాహార దీక్షలకు వివిధ సంఘాల మద్దతు పలికాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర రెడ్డి, లింగాల లోకేశ్వర్‌రెడ్డి, రమేష్ నాయుడు, సురేంద్ర చౌదరి, ప్రభాకర్‌రెడ్డి, బైరవప్రసాద్, చౌడప్ప, శివప్రసాద్ మద్దతు తెలిపారు.

సీసీ కెమెరా ఏర్పాటు

బత్తలపల్లి: మండలంలోని నల్లబోయనపల్లి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శివశంకర్‌నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన స్టాక్ పాయింట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇసుకను పారదర్శకంగానే విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 11వేల టన్నుల ఇసుక పంపిణీ చేసినట్లు తెలిపారు. భద్రత కోసం సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యదర్శి నారాయణస్వామి, వీఆర్‌ఓ నాగేంద్ర పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మృతి



పొగాకు బాషా (ఫైల్)

అమడగూరు: మండలంలోని మహమ్మదాబాద్‌కు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పొగాకు బాషా (60) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కడుపులో నొప్పి రావడంతో శనివారం ఆయన్ను బెంగుళూరు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగా ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. మృతికి దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాగా పొగాకు బాషా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఎంతో శ్రమించారు. బుధవారం ఉదయం మహమ్మదాబాద్‌లో పొగాకు బాషా అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

వర్షం కోసం పూజలు



బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

తలుపుల : సమృద్ధిగా వర్షాలు కురిపించాలని కోరుతూ మండల కేంద్రం మాడికవాండ్లపల్లి గ్రామంలో గ్రామస్తులు మంగళవారం పూజలు నిర్వహించారు. గ్రామం చుట్టూ ఉన్న బొడ్రాయిలకు 101 బిందెల నీళ్లుపోసి కొబ్బరికాయలు కొట్టారు. అనంతరం గ్రామ సమీపంలో ఓబుళేశ్వరునికి పూజలు చేశారు. దిగువన ఉన్న కాటమయ్యకు పూజలు చేసి నైవేద్యం పెట్టి కొబ్బరికాయలు కొట్టి జంతుబలి ఇచ్చారు.

నేడు ద్విచక్రవాహనాల వేలం

చెన్నేకొత్తపల్లి: స్థానిక సెబ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం ద్విచక్రవాహనాల వేలం నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ లలితాదేవి, ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 4 ద్విచక్రవాహనాలను బహిరంగ వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఉదయం 10 గంటలకు స్టేషన్ వద్ద డిపాజిట్ చెల్లించి పాల్గొన వచ్చని సూచించారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



బత్తలపల్లిలో అగ్నిగుండం వెలిగించిన దృశ్యం



బత్తలపల్లి: చక్కెరను చదివించేందుకు వెళ్తున్న భక్తులు



తలుపులలో పీర్ల ఊరేగింపు

మొహర్రం వేడుకల్లో భాగంగా ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో మంగళవారం పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. పీర్ల స్వాములకు ముజావర్లు ఫాతేహా జరిపించి భక్తాదులకు ప్రసాదాలు అందజేశారు. యువకులు మకాన్ వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ మేళ తాళాలు, దప్పుల వాయిద్యాల నడుమ అలావ్ తొక్కుతూ ఉత్సాహంగా గడిపారు.

తాడిమర్రి: మండల కేంద్రంలో కుళ్లాయిస్వామి, అక్బర్, పెద్ద కాశీం, చిన్న కాశీం తదితర పీర్లకు పానకం దుత్తలు సమర్పించారు. అనంతరం భక్తులు స్వామికి చక్కెర, బెల్లం చదివింపులు జరిపించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం సాయంత్రం పీర్లను జలధికి తీసుకెళుతున్నట్లు ముల్లాసాబ్ హుస్సేన్‌సా తెలిపారు.

తనకల్లు: మండల కేంద్రంతోపాటు దుగినేపల్లి, ఉస్తినిపల్లి, కుంటమరువ, కోటూరు గ్రామాల్లో మంగళవారం మొహర్రం తొమ్మిదో రోజు(నౌఖన్) వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే పీర్లను ఊరేగించారు. మొహర్రంచివరి రోజు బుధవారం ఉదయం బైరాగిస్వామి గుట్ట వద్ద నాలుగు గ్రామాల పీర్లు ఒకేచోట కలుస్తాయి. అత్యంత కన్నుల పండువుగా నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరవుతారు.

తలుపుల : మండల కేంద్రంలో మూడు రోడ్ల కూడలిలో మంగళవారం కుమ్మరపేట, ఎగువపేట, గంజివారిపల్లి పీర్లు భేటీ అయ్యాయి. యువత నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా అలావ్ తొక్కారు.

ఆత్మకూరు: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పానకాల కుండలను తలపై పెట్టుకొని దప్పులతో పీర్ల చావిడి వద్దకు తీసుకెళ్లి చదివింపులు చేయించారు. ఆత్మకూరులోని సర్దార్ వలి దర్గాలో వేలాది మంది భక్తులు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఉత్సవాలకు తరవలిచ్చారు. మొక్కుబడి ఉన్న భక్తులు చెట్లను కొట్టి ఎద్దులు, ట్రాక్టర్ల ద్వారా గుండం వద్దకు తరలించారు. అనంతపురం, బెంగళూరు నుంచి రూ.వేలు విలువజేసే పూల మాలలను తీసుకొచ్చి పీర్లను అలంకరించారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

కనగానపల్లిలో..

కనగానపల్లి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పలు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో దస్తగిరి, వన్నూరుస్వామి ఉత్సవాల్లో పీర్లస్వాములను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. భక్తులు పీర్ల స్వాములకు చెక్కర, గంధం చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల చావిడి ఎదుట అగ్నిగుండాలు వెలిగించి పిల్లలు, పెద్దలు వాటి చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా అలావు తొక్కారు. కాగా బుధవారం చివరి రోజు పీర్లస్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు.



కనగానపల్లిలో వన్నూరుస్వామికి చక్కెర చదివింపులు చేస్తున్న భక్తులు



తాడిమర్రిలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న పీర్లు



తనకల్లు: చావడి చుట్టూ పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



ఆత్మకూరు: చెట్లను గుండంలోకి తరలిస్తున్న భక్తులు

మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: మొహర్రం వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు.మండంలోని గంటాపురం, పోట్లమర్రి, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, వెంకటగారిపల్లి, మాల్యవంతం, అనంతసాగరం తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి వారు పర్యటించారు. గ్రామపెద్దలతో సమావేశమై సూచనలు, సలహాలు అందించారు. మత సామరస్యతకు ప్రతీక అయిన ఉత్సవాల్లో ఎలాంటి గొడవలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం మత్తులో ఇరువర్గాలు గొడవలకు దిగినా సహించమన్నారు. బుధవారం జరిగే పీర్ల భేటీ, జలధి పురస్కరించుకొని మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుష్టు నివారణకు పక్కాగా సర్వే



మాట్లాడుతున్న వైద్యాధికారి మహేశ్వర మారుతి



నల్లచెరువులో మాట్లాడుతున్న వైద్యాధికారులు



ముదిగుబ్బలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగేంద్ర నాయక్

గాండ్లపెంట: ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సిబ్బందికి వైద్యాధికారులు సూచించారు. కుష్టు నివారణ, బాధితులను గుర్తించే కార్యక్రమంపై స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు మహేశ్వరమారుతి, బాబాఫకృద్దీన్ ఆధ్వర్యంలో డీపీఓ రెడ్డికుమార్‌రెడ్డి మంగళవారం అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శలేని రాగి రంగు మచ్చల పొదలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరాలు, కాళ్లు, కండరాల బలహీనతగా ఉంటాయన్నారు. చేతులు, పాదాలు, నరాలలో తిమ్మిర్లు అనిపించడం, చెవి తమ్మెలు మందంగా మారిపోవడం, కాళ్లనుంచి చెప్పులు జారిపోవడం లక్షణాలు ఉంటాయన్నారు. కుష్టుపై అన్ని పీహెచ్‌సీల్లో ఎండీటీ పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తామని డీపీఓ తెలిపారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వరకు ఇంటింటి సర్వే చేపట్టి కుష్టు లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. హెచ్‌ఈ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్లు ఉపేంద్రారెడ్డి, పార్వతమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి అలేఖ్య మంగళవారం కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టు లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలని సిబ్బందికి సూచించారు. సీహెచ్‌ఓ రామ చంద్రారెడ్డి, పీహెచ్‌ఎన్ భారతి, సూపర్‌వైజర్ సుధాకర్, రెడ్డెమ్మ, ఏఎన్‌ఎం సరస్వతి పాల్గొన్నారు.

ముదిగుబ్బ: కుష్టుపై వైద్యాధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్ మంగళవారం వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వరకు ఇంటింటికీ వెళ్లి 2 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ చర్మం మీద స్పర్శలేని మచ్చలు, నొప్పి లేని మచ్చలు ఉన్నాయా? అని గుర్తించాలన్నారు. వేణుగోపాల్ రెడ్డి, పీహెచ్‌ఎన్ లక్ష్మీ నరసమ్మ, ఎంపీహెచ్‌ఎస్ రవి శంకర్ పాల్గొన్నారు,

ఏకలవ్య జయంతికి తరలిరండి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం జరగనున్న ఏకలవ్య జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎరుకుల సంఘం సభ్యులు మంగళవారం కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎరుకల ప్రజాపోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల సురేష్ మాట్లాడుతూ స్థానిక అంబేడ్కర్ విగ్రహ ఆవరణలో ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఎరుకల సోదరులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. అనంతరం ఎరుకల సోదరుల సమస్యలపై చర్చిస్తామన్నారు.

కౌలు రైతులు సీసీఆర్‌సీ పత్రాలు పొందాలి





సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి , నల్లచెరువులో మాట్లాడుతున్న ఏఓ భారతి

ఎన్‌పీకుంట: భూమిని కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయ, రెవెన్యూ అధికారులను సంప్రదించి పంట సాగు ధ్రువీకరణ (సీ సీ ఆర్ సీ) పత్రాలు పొందాలని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి సూచించారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా కౌలు రైతులను గుర్తించి సీ సీ ఆర్ సీ పత్రాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కౌలు కార్డులు పొందిన కౌలు రైతు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకానికీ అర్హులవుతారని సూచించారు. కౌలు హక్కు పత్రాలకు 11 నెలల కాల వ్యవధి ఉంటుందన్నారు. ఈ వ్యవధిలో సాగు చేసిన పంటలకు ప్రకృతి విపత్తులతో నష్టం వాటిల్లితే పరిహారం పొందవచ్చని తెలిపారు. కౌలురైతు పత్రం కోసం దరఖాస్తు సమయంలో భూ యజమాని నుంచి అంగీకార పత్రం, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్, సీ సీ ఆర్ సీ దరఖాస్తు ఫారంపై భూ యజమాని సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. కౌలు రైతు ఆధార్‌కార్డ్, బ్యాంకు పాసుపుస్తకం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. భూ యజమానులు తమ భూమిని కౌలుకు ఇచ్చినప్పుడు కౌలు రైతులకు సీ సీ ఆర్ సీ కార్డులు పొందడానికి నిరభ్యంతరంగా సహకరించాలని ఆయన సూచించారు.

నల్లచెరువు: కౌలు రైతులకు గుర్తింపు కార్డులపై మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవికుమార్, ఏఓ భారతి మంగళవారం అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను వీఆర్‌ఓలు పరిశీలించి అర్హులకు కార్డులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

కమల పుష్పాలతో అలంకరణ



కమల పుష్పాల అలంకరణలో వాసవీమాత

ధర్మవరం అర్బన్: ఆషాఢమాసం సందర్భంగా పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం వాసవీమాతను కమల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీ వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వృద్ధురాలిని అనాథాశ్రమంలో చేర్చిన యువకులు



వృద్ధురాలు లక్ష్మిని ఆశ్రమంలో చేర్పిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: స్థానిక పరిగి బస్టాండ్ దగ్గరున్న వృద్ధురాలిని అల్ ఇందాద్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆమెను అనాథాశ్రమంలో చేర్చారు. వివరాల్లోకెళితే.. కర్ణాటకలోని ఎస్‌ఆర్ పల్లికి చెందిన లక్ష్మి (70) ఆదివారం తన కుమారుడితో కలసి హిందూపురం వచ్చింది. అయితే కుమారుడు తిరిగి వస్తానని చెప్పి ఆమెను ఇక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. కుమారుడి కోసం అక్కడే రాత్రి వరకూ ఎదురు చూసి బస్టాండ్ వద్దే నిద్రించింది. దీంతో అక్కడ ఉన్న వారు గమనించి అల్ ఇందాద్ ట్రస్ట్ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ట్రస్ట్ అధ్యక్షుడు అమన్, కార్యదర్శి ఉమర్ ఫారూక్, జాయింట్ కార్యదర్శి ఉస్మాన్, రిహాన్ తదితరులు అక్కడికి చేరుకుని ఆ వృద్ధురాలిని పట్టణంలోని అనాథాశ్రమంలో చేర్పి మానవత్వం చాటుకున్నారు.

తొలి ఏకాదశి వేడుకలు ప్రారంభం

హిందూపురం: తొలి ఏకాదశిని పురస్కరంచుకుని హిందూపురంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పేట వేంకటరమణస్వామి ఆలయంలో ఉదయం మూలవిరాట్ వెంకటరమణస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పండరీపుర పాండురంగస్వామి అలంకరణ చేసి విశేషంగా పూజలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణస్వామి ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేశారు. ముదిరెడ్డిపల్లిలోని రుక్మిణి పాండురంగస్వామి, మున్సిపల్ ఆఫీసు వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

పరిగిలో డెంగీ కేసు నమోదు



శ్రీరంగరాజుపల్లిలో పర్యటిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, వైద్యసిబ్బంది

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి ఎస్సీ కాలనీలో డెంగీ కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీ వాసి అశోక్‌కుమార్ భార్య శ్రావణి డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయిందని వైద్యాధికారులు తెలిపారు. ఈక్రమంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ మంజువాణి శ్రీరంగరాజుపల్లిలో పర్యటించారు. డెంగీ జ్వరం బారిన పడిన శ్రావణి కుటుంబంతో పాటు గ్రామంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించారు. తొలుత స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్లు, వైద్యారోగ్ శాఖ సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. అక్కడి నుంచి శ్రీరంగరాజుపల్లికి వెళ్లారు. అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రావణి కుటుంబ సభ్యులతో సమావేశమయ్యారు. శ్రావణి ఆరోగ్యం మెరుగుపడినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. అనంతరం పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాధుర్య, మెడికల్ ఆఫీసర్లు స్వరూపరెడ్డి, నవీన, జుబేర్, డెంటిస్ట్ కోరే మోహన్, సీహెచ్‌ఓ వన్నప్ప, మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

గోరంట్ల: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదివిన 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకన్ ఇంగ్లిష్ , కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్‌స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 9000487423 నంబరును సంప్రదించాలన్నారు.

హోంగార్డు కుటుంబాన్ని ఆదుకుంటాం



చెన్నప్ప భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు మండలం యర్రపల్లిగ్రామానికి చెందిన హోంగార్డు చెన్నప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. ఏఆర్ డీఎస్పీ విజయకుమార్ మంగళవారం తన సిబ్బందితో యర్రపల్లి గ్రామానికి వెళ్లి చెన్నప్ప భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అంత్యక్రియల కోసం రూ.10 వేలు చెన్నప్ప కుటుంబ సభ్యులకు అందజేశారు. చెన్నప్ప కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని, కుటుంబాన్ని శాఖాపరంగా అన్నివిధాలా ఆదుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు. ఏఆర్ ఎస్‌ఐలు శ్రీరాములు, షామీర్, హోంగార్డులు పాల్గొన్నారు.